ఈ వ్యవస్థను ఉపయోగించి లోకవిద్య స్వరాజ్యాన్ని విస్తరించడానికి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి అవకాశముంది. ప్రస్తుత పార్టీ వ్యవస్థ స్థానే ప్రజలు కేంద్రీకృతంగా చేసే పార్టీ రహిత ఎన్నికలతో సహ ఈ క్రింది పద్ధతులు లోకవిద్య స్వరాజ్ స్థాపనకు దారితీస్తాయి.

- జ్ఞాన, సామాజిక పంచాయితీలు ప్రస్తుత గ్రామ పంచాయితీల స్థానంలో నిర్మింపబడాలి. గ్రామపంచాయితీ నిర్మాణ పద్ధతుల్లోనే జ్ఞాన మరియు సామాజిక పంచాయితీల నిర్మాణం జరగాలి. వాటి నిర్మాణం మీద ముందు పేరాల్లో వివరంగా చర్చించడం జరిగింది.
- పంచాయితీ సభ్యులు జ్ఞాన పంచాయితీ, సామాజిక పంచాయితీల నుండి ఎన్నిక కాబడాలి. ఈ ఎన్నికలు వీలైనంత వరకు ఏకాభిప్రాయంతో జరగాలి. ఒకవేళ ఎన్నిక జరపాల్సి వచ్చినా బయట శక్తుల ప్రమేయం వుండరాదు.
- జిల్లా పంచాయితీ కూడా సమితిల నుంచి వచ్చిన సభ్యుల ద్వారా ఏర్పడడం జరిగినా ఆ సభ్యులను పంపడం ఏకాభిప్రాయంతో జరపాలి.
- ప్రతీ జిల్లాకు జిల్లా పంచాయితీలు వున్నాయి. అటువంటి కొన్ని జిల్లాలు కలిపి పార్లమెంట్ లేదా అసెంబ్లీ నియోజక వర్గాలుగా ఏర్పరచారు.
- విధానసభ నియోజక వర్గంలోని జిల్లా పరిషత్తులు కలిసి స్థానిక శాసన సభగాను, పార్లమెంటు నియోజక వర్గంలోని జిల్లా పంచాయితులు స్థానిక పార్లమెంట్‌గానూ ఏర్పడాలి. శాసనసభ, పార్లమెంట్ సభ్యులను జిల్లా పంచాయితీల సభ్యులు ఎన్నుకోవడానికి విధి విధానాలు నిర్ణయించాలి.
- అసెంబ్లీ నియోజక వర్గ జిల్లా పంచాయితీలు అసెంబ్లీ సభ్యులను, పార్లమెంట్ నియోజక వర్గ జిల్లా పంచాయితీల సభ్యులు పార్లమెంట్ సభ్యులను ఎన్నుకోవడంతో ప్రజల ప్రతినిధులుగా వారు ఎన్నికైనా ఏ రాజకీయపార్టీకీ సబంధించని వారై వుంటారు.
- ఏ పార్టీకి సంబంధించని శాసనసభ, పార్లమెంట్ సభ్యులు వారివారి మంత్రులను, ముఖ్యమంత్రులను, ప్రధానమంత్రిని మిగతా మంత్రులను ఎన్నుకోవడం జరుగుతుంది.

ఈ ఎన్నికల విధానంలో పెట్టుబడిదారుల యొక్క, డబ్బు యొక్క ప్రభావం పూర్తిగా తగ్గిపోతుంది. నల్లధన ఉత్పత్తి తగ్గిపోవడం, తద్వారా నిర్మూలించబడటం జరుగుతుంది. ప్రస్తుత ఎన్నికల విధానంలోని కుల, మత, ప్రాంత, జాతి, లింగ బేధాలను రెచ్చగొట్టే విభజన శక్తులు, ఓటుబ్యాంక్ రాజకీయాలు పూర్తిగా నిర్మూలింపబడతాయి. అరాచక శక్తులు, అవినీతిపరులు, నేరస్తులు శాసనసభ, పార్లమెంటులలో కనబడడం మానివేస్తారు. అటువంటి ప్రజాస్వామ్య బద్ధమైన శాసన సభ, పార్లమెంటు వాతావరణాన్ని ప్రకృతిని రక్షించే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తాయి.

**జ్ఞానం అంటే**

- **లాభాపేక్ష కోసం పరిశ్రమకారాదు** ♦ **జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు**
- **వ్యక్తిత్వ వికాసానికి సమాజం అందరికి ఉపయోగపడేది మాత్రమే**
- **దోచుకోడానికి పనికి వచ్చేది కాదు** ♦ **మానవుణ్ణి సంపూర్ణ మానవుణ్ణిచేస్తుంది**
- **సమాజంలో అసమానతలు తొలగించేది విద్య** ♦ **అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే**



# లోకవిద్య స్వరాజ్యం

డా॥ లలిత్‌కౌల్

తెలుగు తర్జుమా : **నారాయణరావు టి & రామారావు కెజె**

**ప్రత్యామ్నాయ దోపిడీ రహిత రాజకీయ, ఆర్థిక వ్యవస్థ నిర్మాణ ప్రణాళిక**

ప్రతులకోసం
**లోకవిద్య జనాందోళన**
ఇం.నెం. 13-10-100, న్యూగడ్డిఅన్నారం,
శివగంగ సినిమాహాళ్ళ వెనుక, హైదరాబాద్-500060
ఫోన్ : 040-24152155
e-mail : tnrkoundinyasa@yahoo.com

# లోకవిద్య స్వరాజ్యం

భారతీయ సమాజాన్ని పునర్వ్యవస్థీకరించి నూతన సమాజాన్ని నిర్మించటంలో మార్గదర్శనం చేయటం లోకవిద్య స్వరాజ్యం లక్ష్యం.

ఈ భావన ద్వారా సామాన్య ప్రజల జ్ఞానం, నైపుణ్యాల మీద ఆధారపడిన నూతన సమాజ నిర్మాణం జరిగి, సమాజంలో వున్న ప్రజలందరూ తమ జ్ఞానం ద్వారానే; వస్తువుల, ఉత్పత్తుల సేవల ద్వారా తమ జీవనం సాగిస్తున్నారని, దీనికి లింగ, వర్ణ, కుల, మత ప్రాంతీయ భేదాలు అడ్డంకులు కావని లోకవిద్య స్వరాజ్యం ప్రగాఢంగా విశ్వసిస్తోంది.

సమాజంలోని ప్రతీ వ్యక్తి తన జీవనోపాధి కోసం సమాజంలో చేసే పనికి సంబంధించిన మెలకువలు నేర్చుకుంటున్నాడు. తద్వారా స్వతంత్రమైన గుర్తింపును సమాజంలో పొందుతున్నాడు.

మానవులందరికీ ఉన్న వివిధ రకాల జ్ఞానాలు ఒకదానితో మరొకటి ఘర్షణ వైరుధ్యాలతో కాక, వైవిధ్యంతో పరస్పరం సహకరించుకుంటూ నూతన సమాజ నిర్మాణానికి కృషి చెయ్యడం ద్వారా లోకవిద్య స్వరాజ్యం సాధించగలం.

సామాజిక అవసరాల దృష్ట్యా జ్ఞానం ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతూ వుంటుంది. అభివృద్ధి చెందుతున్న సమాజం సామాజిక అవసరాలకు అనుగుణంగా కొత్త జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే పురోగమనంలో కుల, మత, వర్గ, లింగ భేదాలు ఏవిధంగానూ అడ్డంకులు కావు. జ్ఞాన అభివృద్ధి అనేది కుల, మత, ప్రాంత, దేశ, లింగ భేదాలపై ఆధారపడి లేదు. ఒక ప్రాంతపు జ్ఞానం ఉత్తమమైనదని గానీ, మరోప్రాంతపు జ్ఞానం హీనమైనదని గానీ అనరాదు. ఒక ప్రాంత అభివృద్ధికోసం సంపూర్ణమైన ఒక జ్ఞానాన్ని అభివృద్ధి చేసి ఆచరణలో పెట్టినపుడు అది సరియైనదని కానీ, తప్పుడు విధానమని కానీ ఇతర ప్రాంతాల గుర్తింపు అవసరంలేదు.

ఇప్పటిదాకా వున్న పద్ధతులకు భిన్నంగా కూడా జ్ఞానాన్వేషణ, జ్ఞాన సముపార్జన జరుగుతాయనీ; పుస్తకాలు, ప్రామాణిక గ్రంథాలు, ఆచరణలు, అలవాట్ల ద్వారా అమలులో వున్నదానికి భిన్నంగా కూడా జ్ఞానాన్ని సముపార్జన చేయవచ్చనీ లోకవిద్య స్వరాజ్యం విశ్వసిస్తోంది.

నిర్మించబోయే నూతన నాగరిక సమాజం, ప్రతిమనిషికీ తన అభిరుచి మేరకు కుల, మత, ప్రాంత, లింగ, దేశ భేదాలకు అతీతంగా జ్ఞాన సముపార్జన చేసి సమాజంలో జీవించడానికి; దాని అభివృద్ధికి తోడ్పడడానికి ఒక్కమాటలో సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉద్యోగం, ఉపాధి లభించడానికి, ఆ జీవనానికి కావల్సిన వనరుల కోసం, చేయదలచిన పనికి సంబంధించిన జ్ఞాన సముపార్జన చేయడానికి విస్తృతమైన అవకాశాలు కలిగి వుండడమే లోకవిద్య స్వరాజ్యం.

ప్రస్తుతమున్న ఒక కుటుంబంలో కానీ ఒక కులంలో కానీ, మతంలో కానీ, లింగ భేదాలకు ఏ ఒక్కరూ కారణం కాదు. నియంత్రణ లేని పుట్టుకవల్ల సంభవించాయి. కానీ ప్రస్తుతమున్న జ్ఞానం, నైపుణ్యం, సంపాదన మాత్రం ఈ కుల, మత, ప్రాంత, లింగ భేదాలకతీతంగా ప్రతీ వ్యక్తి నిర్ణయం మేరకు సంభవిస్తాయి. ప్రస్తుత కుల, మత, ప్రాంత, లింగ, భాష భేదాలను పరిరక్షించే శక్తులు చేస్తున్న అరాచకాలను, జ్ఞాన ఆధారితంగా గౌరవం లభించే నూతన సమాజ



మాత్రమే ఈ భేదాలనన్నీ పరిష్కరిస్తుంది. ఒక్కమాటలో అన్ని వైరుధ్యాల పరిష్కారానికి మార్గం జ్ఞాన ప్రామాణికత నూతన సమాజ నిర్మాణమే.

జ్ఞానం ఏవిధంగా అభివృద్ధి చెందుతుందో సమాజం కూడా ఆ మేరకు అభివృద్ధి చెందుతుందని ప్రగాఢంగా మేం విశ్వసిస్తున్నాం. ఈ జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి కుల, మత, ప్రాంత, లింగ భేదాలు ఆటంకాలులేని సమాజమే లోకవిద్య స్వరాజ్యం.

లోకవిద్య స్వరాజ్యంలో అత్యంత గౌరవం లభించాలంటే అత్యున్నత జ్ఞానం సంపాదించడమే ఏకైక మార్గం.

లోకవిద్య స్వరాజ్యంలో తమ జీవనోపాధికి తన జ్ఞానాన్ని ఉపయోగించనివాడు జ్ఞానవంతుడు, గౌరవనీయుడు కాజాలడు.

**లోకవిద్య స్వరాజ్యం, ప్రజాస్వామ్యం**

లోకవిద్య స్వరాజ్యం, ప్రజాస్వామ్యం వేర్వేరు విషయాలు. లోకవిద్య స్వరాజ్యంలో పూర్తి ప్రజాస్వామ్యం వున్నా, ప్రజా స్వామ్య వ్యవస్థలో లోకవిద్య స్వరాజ్యం వుండి తీరాలనే నిబంధన లేదు.

ప్రస్తుతమున్న రాజ్య వ్యవస్థలో ప్రజాస్వామ్యం అనేది దేశ అవసరాల కోసం ఏర్పడింది. నేటి సమాజంలో అవసరాలు, రాజ్య అవసరాలే కానీ సమాజ అవసరాలు కాదు. అందుచేత దేశ అవసరాల పేరుతో నేటి సామాజిక అవసరాలను ఒక్కమాటలో ప్రజా అవసరాలను కాలరాయడం జరుగుతోంది.

ప్రాశ్చాత్య దేశాల ప్రజాస్వామ్య నిర్వచనం ప్రజల కొరకు, ప్రజలచేత, ప్రజలవలన వచ్చిన ప్రభుత్వాలే ప్రజాస్వామ్యం అన్న సూత్రం కూడా మనదేశంలో ఈనాడు అమలులో లేదు. ఈనాడు ఎన్నుకోబడిన ప్రభుత్వం యొక్క అవసరాల మేరకు ప్రభుత్వంలోని విభాగాలన్నీ ప్రజాస్వామ్యం పేరుతో పని చేస్తున్నాయి.

ఈనాడు ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులతో ప్రజాసంపదలు అంటే భూమి, అడవి, నీళ్ళు, సహజ వనరులు, దేశ ఆర్థిక వ్యవస్థ కొద్దిమంది అవసరాలకు వాడడంతో కోట్లాది ప్రజలు నిరాశ్రయులౌతున్నారు. ప్రజాస్వామ్యం పేరుతో పెద్ద ఎత్తున ప్రభుత్వం, ప్రయివేట్ రంగంలో ఉత్పత్తులు చేసి ఎటువంటి పోటీలేని మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. ఈ ప్రభుత్వం, ప్రయివేటు ఉత్పత్తి రంగంలో సంపద కొద్దిమంది చేతుల్లో పోగుపడడానికే దోహదపడ్తోంది. కానీ దీని ద్వారా 80 శాతం ప్రజల మీద ప్రభుత్వం పూర్తి ఆధిపత్యంతో పరిపాలన సాగిస్తోంది.

స్వరాజ్యం నా జన్మహక్కని స్వాతంత్రోద్యమంలో లోకమాన్య బాలగంగాధర్‌తిలక్ ఎలుగెత్తి చాటాడు. పేదరిక నిర్మూలన కోసం గ్రామ స్వరాజ్యాలు నిర్మించాలని మహాత్మాగాంధీ భారత స్వాతంత్ర్య సంగ్రామంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగపడే అంశాన్నీ ప్రధాన అంశంగా తీసుకొచ్చారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు గాంధీజీ స్వరాజ్యమే మార్గదర్శనం చేసింది. కానీ పాలకవర్గాలు ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ గ్రామస్వరాజ్యాన్ని పక్కదోవ పట్టించాయి. అందుకే నేడు 80శాతం దేశ ప్రజలు పేదరికంతో దోపిడికి గురౌతూ, ప్రాథమిక

హక్కుల్ని కోల్పోయి సమాజంలో ఏ గౌరవం లేకుండా బతికే పరిస్థితి నెలకొంది.

ప్రస్తుత ప్రజాస్వామ్యం బదులు లోకవిద్య స్వరాజ్యం ఉపయోగించి ప్రజాస్వామ్యంలో ప్రతీ వ్యక్తీ తన జ్ఞానంతో మాత్రమే తాను నిర్ణయించుకొన్న విధంగా తన జీవనం కోసం జ్ఞానాన్ని సంపాదించుకొనే అవకాశాన్ని కలగచేస్తుంది.

**సమాజం :** సమాజమనేది ఒక ప్రాంత ప్రజల యొక్క పరస్పర అవగాహనతో వారిమధ్య నిర్మితమై తరతరాలుగా వస్తున్నది. అటువంటి సమాజం; రాజ్యం/దేశంతో సంబంధం లేకుండా నిరంతరంగా కొనసాగుతూనే ఉంటుంది. దేశంలేని సమాజాలు ఉండవచ్చు గాని, సమాజాలు లేని దేశాలు ఉండవు. నాగరికత అనేది సమాజ లక్షణం. రాజ్యానికి ఆ లక్షణం ఉండాల్సిన అవసరంలేదు. రాజ్యంతో సంబంధం లేకుండా తన నాగరికత, సంస్కృతి ప్రతీ సమాజానికి మూలాధారాలుగా వృద్ధి చెందుతూనే ఉంటాయి. ఇతర సమాజాలతో సంబంధ బాంధవ్యాలతో ప్రతీ సమాజం తన సంస్కృతి ద్వారా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ ఉంటుంది. అందుకే ఒక రాజ్యంలో అనేక సాంస్కృతిక సమాజాలు ఉండే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. ఏ రాజ్యం అయితే చివరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్న రాజ్యం కూడా తన లక్ష్యాలను చేరటంకోసం తన ప్రాంతంలోని ఏ సమాజం యొక్క సంస్కృతినైనా గుర్తించకపోతే ఆ రాజ్యం నిర్మాణం క్రమంలో అరాచకం వైపు ప్రయాణించటం లేదా నాశనం అవటం జరుగుతుంది.

భారత ఉపఖండం చరిత్ర గమనిస్తే దీని నైసర్గిక స్వరూపంలో అశోకుని 'అఖండ్ భారత్', మొగలాయిల 'హిందూస్తాన్', బ్రిటీషువారి సామ్రాజ్యంలో భారతదేశం, సర్వాసత్తాక ప్రజాస్వామ్య ప్రస్తుత భారత్ రిపబ్లిక్ ఒకటికావు. ఈ నైసర్గిక స్వరూపాలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మార్పులతో పాటు జరిగిపోయాయి. ఇక్కడి సమాజాలలో ఒక క్రమబద్ధమైన కొనసాగింపు ఉన్నది. కాని చరిత్రలో కొన్ని సమాజాలను సామూహికంగా సంపూర్ణంగా నిర్మూలించటంవలన సామ్రాజ్య స్థాపనకు దారితీసింది. ప్రముఖ ఉదాహరణ ఉత్తర అమెరికాలోని స్థానిక 'రెడ్ ఇండియన్స్'ను సామ్రాజ్య స్థాపన కోసం సమూలంగా నిర్మూలించటం జరిగింది. సమాజాలే రాజ్యాలను నిర్మిస్తాయి. కాని రాజ్యాలు సమాజాలను నిర్మించజాలవు. నాగరిక రాజ్య నిర్మాణం జరగాలంటే ప్రాథమికంగా అక్కడ ఉన్న సమాజాల యొక్క ఆశయాలకు అనుగుణంగా, ప్రభుత్వ ఆశయాలు సమాజ పురోభివృద్ధికి అనుగుణంగా ఉండి తీరాలి. ఇటువంటి సమాజ నిర్మాణం జరగాలంటే అభివృద్ధి పథకాలన్నీ పాలకుల చేతికి చివరకు పార్లమెంటు చేతికి ఇవ్వటం ద్వారా మాత్రం కాదు. ఒక మాటలో చెప్పాలంటే రాజ్యాధికారం గాని పార్లమెంటు గాని సమాజం యొక్క ఆశయాలను సాధించటానికి తోడ్పడుట వల్లనే ఆ ప్రభుత్వం పనిచేయగలుగుతుంది. మరో విధంగా మాత్రం కాదు.

**భారతదేశంలో ప్రజాస్వామ్యం :** భారతదేశం ప్రజాస్వామ్య సర్వసత్తాక దేశం. కాని ఈ దేశంలో ప్రజాస్వామ్యానికి ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలను నిరంతరం హరించటం జరుగుతోంది. ఈనాడు ఐదేళ్ళకు ఒకసారి ఓటువేసి పరిపాలన ప్రతినిధుల చేతుల్లో పెట్టి తమ పని అయిపోయినట్లు భావించే భారతీయ సగటు ఓటరు దీనికి ప్రధాన కారణం. ఎన్నికల తరువాత ప్రజావసరాలు గుర్తించి వారి భాగస్వామ్యం గురించి ఏ పార్టీ నాయకుడు కూడా పట్టించుకోవడం



మానేశారు. సమాజంలోని వివిధ వర్గాలువారు, కులాలవారు తమ అవసరాలను మహజర్లు ద్వారా ధరఖాస్తులు ద్వారా ఊరేగింపుల ద్వారా, ఉద్యమాల ద్వారా, ప్రభుత్వ దృష్టికి తెచ్చినా దున్నపోతు మీద నీటి చందాన తయారయింది. ఈ దుస్థితికి కారణం ప్రస్తుత ఎన్నికల ప్రక్రియ, విధి విధానాలే ప్రధాన కారణాలు.

భారతదేశంలో ఎన్నికలు వచ్చాయంటే చాలు అన్ని పార్టీలవాళ్ళు, కులం, మత, లింగ భేదం లేక మరే పద్ధతిలోనైనా ప్రజలను విభజించి తమ పార్టీ గెలుపుకోసం కృషి చేస్తున్నారు. ఈనాడు అన్ని రాజకీయ పార్టీలు ఒక మతానికో, కులానికో సేవ చేయడానికే పుట్టినట్లు కనబడుతోంది. ఒక సముదాయం మీద మరొక సముదాయాన్ని, ఎంతగా ఘర్షణలో పెట్టారంటే ఈ రోజు కుటుంబాల లోపల కూడా ఐక్యత లేకుండా విచ్ఛిన్నమవడం గమనిస్తున్నాము. ఈ రోజు ప్రతీ రాజకీయ కార్యకర్త రాజకీయమంటే ఓటు బ్యాంకు రాజకీయమని, దానికోసం ఏదో ఒక సమూహానికి అనుకూలంగా పనిచేయటం మాత్రమే గెలుపుకుబాటని నమ్ముతున్నారు. దేశంలో అభివృద్ధికోసం ప్రభుత్వాన్ని నిర్మించటం మానేసి వర్గ ప్రయోజనాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం వలన మనదేశం ముక్క చెక్కలయ్యి తిరోగమన దిశగా ప్రయాణిస్తోంది. దీనికోసం ఒకే సమూహానికి లేక సమూహాలకు వీలయినంత ఎక్కువగా రిజర్వేషన్లు ఇచ్చి వారి అభివృద్ధి మాత్రమే తమను అధికారంలో ఉండేటట్లు చేస్తుందనే అభిప్రాయంపై కేంద్రీకరించటం జరిగింది.

మనదేశాన్ని పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాలుగా విభజించటం జరిగింది. ప్రతీ రాజకీయ పార్టీ తమ పార్టీ అభ్యర్థులను అన్ని నియోజక వర్గాల్లోను నిలబెడుతున్నాయి. ఆ అభ్యర్థి ప్రజా ప్రతినిధి అని చెప్పబడినప్పటికీ అతని ఎన్నిక కుల, మత, ప్రాంత, లింగ, వెనుకబాటుతనం ఆధారంగా జరుగుతున్నాయి. వీరిలో ఎక్కువ శాతం గెలిచే సత్తా ఉన్నవారికి మాత్రమే సీట్లు కేటాయించడం వలన నేర చరితులే ఎన్నిక కాబడుతున్నారు. దీనికి తోడు పెద్ద పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు, ఇతర పెట్టుబడిదారులు అభ్యర్థుల గెలుపుకోసం కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెడుతున్నారు. ఈ ఖర్చుకు సరైన లెక్కలు లేక విపరీతంగా నల్లధనం, తెల్ల ధనంతో పాటు చలామణిలోకి వచ్చేస్తోంది.

ఈ ఎన్నికలలో ప్రధానంగా ఎన్నికైన అభ్యర్థి ఏదో ఒక పార్టీకి చెందిన వాడై ఉంటాడు. అప్పటిదాకా అదే నియోజకవర్గంలో నివసిస్తూ ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే సభ్యుడిని, ఆ ప్రాంతం ప్రజలతో ఏ మాత్రం సంబంధంలేని పార్టీ అభ్యర్థి ఓడించటం విడ్డూరం కాదా? గెలిచిన ఈ వ్యక్తికి అక్కడి ప్రజావసరాలు తెలుస్తాయా? వారి ఆకాంక్షలకనుగుణంగా ఏ విధంగా ప్రాతినిధ్యం వహిస్తారు? అక్కడ అభివృద్ధి పనులను ఏవిధంగా గుర్తించగలరు? అక్కడ ప్రజలను ఏ విధంగా ఆ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తూ వారిలోని శక్తిని, నైపుణ్యాన్ని సామాజిక అవసరాలకు ఉపయోగిస్తూ లక్ష్యాలను సాధించగలరు? ఇది జరగని పని.

రాజకీయ పార్టీ టిక్కెట్టుపై ఎన్నికైన ఆ సభ్యుడు ఆ ప్రాంత ప్రజలకు ప్రతినిధిగా గాకుండా తనకు టిక్కెట్టు ఇచ్చిన రాజకీయ పార్టీ యొక్క ప్రయోజనాల రక్షణకే పని చేస్తాడు. ఆ రాజకీయ

పార్టీ ఒకవేళ ముక్కలైతే ఆ సభ్యుడి విశ్వసనీయత తను నమ్ముతున్న వర్గం వైపే పనిచేయటం జరుగుతుంది. ఈ ఎన్నికైన సభ్యుడు పాలకపక్షంలో ఉన్నట్లయితే ప్రభుత్వ పథకాలను తన నియోజకవర్గానికి అవసరమైనా లేకపోయినా అమలు జరపటానికి కృషిచేస్తాడు. కొన్ని పథకాలు ఆ ప్రాంత ప్రజల అవసరాలను, ఉనికిని, భవిష్యత్తును దెబ్బతీసినప్పటికీ రాజకీయ పార్టీ పేరుతో అమలు జరపటానికి వెనుదీయడు. ఒకవేళ ఎన్నికైన సభ్యుడు స్థానిక అవసరాల మేరకు ప్రభుత్వ పథకాలను వ్యతిరేకిస్తే అధికార పార్టీ నుండి బహిష్కృతుడవటమే గాక తన సభ్యత్వం తద్వారా వచ్చే అనేక ప్రయోజనాలు కోల్పోతాడు.

**రాక్షస విలువలతో కూడిన దేశ నిర్మాణం :**

బ్రిటీషువారి పరిపాలనలో భారతదేశంలోని సామాజిక, ఆర్థిక, మతపరమైన, రాజకీయపరమైన వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసి సర్వనాశనం చేశారు. ఇది వారు కావాలనే చేయటం జరిగింది. దానికి ప్రధాన కారణం, వారి ప్రాపంచిక దృక్పథం దృష్ట్యా, వారి ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రయోజనాల కోసం నూతన శాస్త్ర, సాంకేతిక విధానాలపై ఆధారపడి భారతదేశాన్ని ప్రజలను ఎప్పటికీ దోచుకునే విధంగానూ నూతన విధానాలను ప్రవేశపెట్టారు. వీటిలో ప్రధానమైనది దోపిడికి సహాయపడే నూతన విద్యా విధానం. నాటి భారతీయ చదువులు, నాగరిక సమాజ నిర్మాణానికి పనికిరావని, అభివృద్ధి చెందాలంటే నూతన విద్యా విధానం అవసరమని, కొత్త ప్రణాళికతో పాఠశాలలు, కళాశాలలు పెద్ద ఎత్తున స్థాపించారు. భారతీయ మూలాలను సర్వనాశనం చెయ్యటానికి భారతీయ జ్ఞానాన్ని నిర్వీర్యం చెయ్యటానికి వారి నూతన విద్యా విధానం కేంద్రీకరించబడింది. భారతీయ సమాజాన్నీ వారికున్న జ్ఞానాన్నీ పనికిరానిదనీ, వెనుకబడినదనీ ముద్రవేసి, వర్గాలుగా విభజించి అంత:కలహాలకు దారితీశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా మన పాలకులు బ్రిటిషుపాలకుల అభిప్రాయాలను గౌరవించటంతో బ్రిటిషువారు ప్రవేశపెట్టిన దోపిడీ విధానం కొనసాగింది. భారతీయుల జ్ఞానం, శాస్త్రం, నిర్మాణ నైపుణ్యత, ప్రాపంచిక దృక్పథం వలన 1695 ప్రాంతంలో ప్రపంచంలోని వ్యాపార లావాదేవీల్లో 30 శాతం వాటా కలిగిన భారతదేశాన్ని వెనుకబడిన దేశంగా ముద్రవేశారు. దీనితో 1947 నాటికి ప్రపంచ వ్యాపారంలో భారతదేశపు వాటా 4.5 శాతానికి పడిపోయింది. స్వాతంత్ర పోరాటాన్ని నడిపిన నాయకులు ఈ రోజు జరుగుతున్న దోపిడిని నిశ్చేష్టులుగా చూస్తూ ఉన్నారు. కులాల మూలాలను, మత విభజనను ఎన్నడూ లేనంతగా ఈ రోజు పోషిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం స్వాతంత్రం వచ్చిన తరువాత మనదేశ ప్రభుత్వం మీద పట్టు కొద్దిమంది పాశ్చాత్య నాగరికత వంటపట్టించుకున్న వారి వద్ద ఉండిపోయింది. వీరు భారతదేశ మూలాలును గుర్తించటం గానీ, ప్రజల జ్ఞానానికి, సంస్కృతికీ గానీ ఏ మాత్రం విలువ ఇవ్వకుండా వారికి అధికారంలో కానీ, ప్రణాళికలో కానీ భాగం ఇవ్వకుండా పరిపాలించే వారి చేతుల్లో బందీని చేశారు. ఇటువంటి పాశ్చాత్య దృక్పథం ఫరిడవిల్లే వాతావరణంలో రాజకీయ పార్టీ ఆధారిత ప్రజాస్వామ్యం భారతదేశంలో పుట్టడమే నేటి ఈ స్థితికి కారణం.

**భారత సమాజం :** అనేక సాంస్కృతిక సమాజాల సమ్మిళితంగా వస్తోంది. అలాగే వుంటుంది కూడా. నేటి చట్టబద్ధ పరిపాలన, సామాజిక నిర్మాణం బ్రిటిషు పాలకుల ద్వారా పెంచి పోషించబడి



మనమీద రుద్దబడి నేటికీ కూడా వివిధ సామాజిక, సాంస్కృతిక సమూహాలను, వెనుకబడినవారనీ, మూఢనమ్మకాలలో కూరుకుపోయారనీ, పనికొచ్చే జ్ఞానం లేదనీ ముద్రవేస్తూనే ఉన్నారు. వీరేదైనా కార్యక్రమాన్ని వారి జ్ఞానంతో ప్రారంభిస్తే వారి సహజ జ్ఞానాన్ని వెనుకబడిందని అవహేళన చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన స్వాతంత్ర్య సంగ్రామాల్లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆదేశ ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు వెనుకబడిన వారని, జ్ఞానహీనులని వారికి సరైన గుర్తింపు ఇవ్వకుండా న్యూనతతో చూడటం మనదేశంలో మాత్రమే జరిగింది.

జ్ఞానధనులైన వీరి జ్ఞానం ద్వారా సమాజం నడుస్తున్నా, మూఢనమ్మకాల నుంచి విముక్తి చెంది తమ జ్ఞానాన్ని తామే గుర్తించటానికి మరో మహాత్ముడు కావాలా? అందుకే ప్రతీ రాజకీయ సంస్థ తమవర్గం నుండి ఒక మహాత్ముడిని సృష్టిస్తోంది. వీరంతా వివిధ నమ్మకాలు కలిగిన వివిధ రాజకీయ పార్టీలకు చెందినా వీరి అందరి యొక్క లక్ష్యం ఒక్కటే. ప్రస్తుతం ఉన్న దోపిడీని ఈనాటికీ ఏనాటికీ కూడా కొనసాగించడమే. వీరంతా కూడా నాయకుడి తర్వాత నాయకుడు అందరి ముక్తికి ఒక్కటే మార్గాన్ని చూపుతున్నారు. అదే బ్రిటిషువారు స్థాపించిన అభివృద్ధి పంథా.

నేడు దోపిడి లేని సమాజంకోసం, సమాజపునర్ నిర్మాణాన్ని, సమాజ అభివృద్ధిని కాంక్షించే వారు గుర్తించాల్సిన విషయం అటు మితవాదులు, పెట్టుబడిదారులు, ఇటు వామపక్ష భావాలు కలిగిన వారు కలిసి ప్రజలను విముక్తులను చేయలేకపోవడం, వీరెవ్వరు కూడా భారతదేశ పునర్ నిర్మాణంలో ప్రణాళికలు రచించడంలో గాని, నిర్ణయాలు తీసుకోవడంలో గాని, నిర్ణయాలు అమలుజరపడంలోగాని, పర్యవేక్షించడంలో గాని ప్రజలను భాగస్వాములను చేయకపోవటమే. నిర్ణయాలన్నీ ప్రభుత్వమో లేక పెట్టుబడిదారులో చేస్తున్నారు. ఈ రెండు వర్గాల మధ్య పెనవేసుకున్న బాంధ్యవ్యం వారి అవసరాల కోసమే ప్రణాళికలు రచించడం, వారి లాభాలకోసమే కార్యక్రమాలు అమలవ్వడం నేడు ప్రజలు గుర్తించారు.

భారత రాజ్యాంగం ప్రభుత్వానికి దేశంలోని ప్రకృతి వనరుల పై, నీళ్ళపై, అడవిపై, భూమిపై వాతావరణంపై, ఆకాశంపై అభివృద్ధి పేరుతో దోచుకోవటానికి హక్కులను ఇస్తూ ప్రజల ప్రాథమిక హక్కులను హరించటానికి అవకాశం కల్పించారు. భారత పౌరుల ప్రాథమిక అవసరాలు నిర్భయంగా బ్రతికే హక్కు హరించటానికి ఇంతకంటే మంచి ఆయుధం యింకొకటి లేదు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసే ప్రజల హక్కులను హరించే ఈ పద్ధతిని ప్రజాస్వామ్యమని పాలకులు అభివర్ణిస్తున్నారు. దీని ద్వారా భూమి, నీరు, అడవి, గాలి, ఆకాశం రాజకీయ, పెట్టుబడిదారుల చేతుల్లోకి తీసుకోవడానికీ ఉపయోగపడ్తోంది. ఈ రాజకీయ నిర్మాణం నిలబడాలంటే కుల, మత లింగ బేధాల పేరుతో, వెనుకబడిన తరగతుల పేరుతో ప్రజలను విడదీయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. నేడు అదే జరుగుతోంది.

పోయిన 67 సంవత్సరాలుగా అభివృద్ధి పేరుతో రైతుల నుండి భూములు, ఆదివాసుల నుండి అడవులు, సామాన్య ప్రజలనుండి నదులు, గనులు లాక్కొని పెద్ద ఎత్తున భారతదేశ ప్రజలను నిర్వాసితులను చేయటం చూస్తున్నాం. ఉపాధి, ఇళ్ళు, కోల్పోయిన ఈ ప్రజలు పెద్ద సంఖ్యలో కూలీలుగా మారిపోతున్నారు. స్వయంశక్తితో నిలబడిన వేల సంవత్సరాల నుండి

ప్రజావసరాలను తీర్చిన వృత్తిదారులంతా ఈ రోజు ప్రభుత్వ రాయితీలు కోసం యాచకులుగా చేయచాచే స్థితికి దిగజార్చబడ్డారు.

ఈ ప్రభుత్వ పరిపాలనను అత్యంత అనాగరిక కుళ్ళిపోయిన దోపిడీ పద్ధతిగా అభివర్ణించొచ్చు. ప్రతీ పనీ చేయగలిగిన వృత్తి విద్యాధరుడికీ, పంటలు పండించగలిగిన రైతుకీ, మూలికలు, అడవిసంపద, మందులు లేదా మరో అవసరాలు తీర్చే ఆదివాసీలకు; వారు పనిచేసే, నివసించే ప్రాంతం నుండి వెళ్ళగొట్టబడటానికి సహకరించే అన్ని రకాల వ్యవస్థలను ఎన్నికల పేరుతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల సభలను, వాటి నిర్ణయాలను సమర్ధించే న్యాయస్థానాలను గమనిస్తే భారతదేశంలో ఏ అభివృద్ధి జరగలేదనీ, జరగదనీ అందరికీ అవగతం అవుతుంది.

**లోకవిద్య ఆలోచన :** లోకవిద్య స్వరాజ్యం అనే భావనకు పునాది లోకవిద్యలోని ప్రాథమిక ఆలోచనావిధానాలే. సమాజమంటే వివిధ కులాల, మతాల సంస్కృతుల, సమూహాల గుర్తింపువల్ల కాదని, వివిధ పనులు చేయడానికి తెలిసిన జ్ఞానము, మెలకువలు కలిగిన అనేక సమూహాల సమాహారమే సమాజం. లోకవిద్యజ్ఞానం తోటే ప్రజలు తమ యొక్క సంపాదన సంపాదించుకుంటూ ఆ జ్ఞానం మీద ఆధారపడి జీవిస్తున్నారు. లోకవిద్య యొక్క ప్రధాన స్వభావాలు ఈ క్రింది విధంగా ఉంటాయని చెప్పవచ్చు.

1. ప్రజలలోని సామూహిక జ్ఞానమే లోకవిద్య అనిపిలువబడుతుంది.
2. ఈ జ్ఞానాన్ని ప్రస్తుత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నేర్పలేవు, సమకూర్చలేవు.
3. పాఠశాలకు, కళాశాలకు, విశ్వవిద్యాలయాలకు వెళ్ళనివారంతా అజ్ఞానులు అనే భావన శుద్ధ తప్పు. సామాన్య ప్రజల సంపాదనకు ఆధారమైన జ్ఞానం సమాజం ముందుకు నడపడానికీ వారు బ్రతకటానికీ పనికి వస్తుంది గనుక అది జ్ఞానమే. ఈ లోకవిద్యా జ్ఞానంతో పనిచేసే వారంతా లోకవిద్యాధరులుగా పిలువబడుతూ లోకవిద్యను ముందుకు తీసుకుపోయే జ్ఞానులుగా గుర్తింపబడతారు.
4. రైతులు, వివిధ వృత్తి విద్యాధరులు ఇంటిని నడిపే స్త్రీలు, చిన్న వర్తకులు, అడవి మీద ఆధారపడి నివశించే ఆదివాసీలు, వివిధ సేవలనందించే వృత్తి విద్యలవారు వివిధ రకాల జానపద కళాకారులు; ఇంటిని, వీధులను, పరిసర ప్రాంతాలను శుభ్రపరుస్తూ; ప్రకృతిని సామాన్య ప్రజల కోసం తమ జ్ఞానం ద్వారా మాత్రమే రక్షిస్తూ సమాజాన్ని ముందుకు తీసుకుపోతూ, తమ పోషణకు సరిపడే సంపాదనను సంపాదించుకుంటూ బ్రతికే ప్రజలంతా లోకవిద్య సమాజాన్ని నిర్వహిస్తున్నారు.
5. లోకవిద్య ప్రపంచంలో సమాజాన్ని ఏవిధంగా నిర్వహిస్తూ ముందుకు తీసుకుపోవాలి, ఏ విలువలు పద్ధతులు అమలు చెయ్యాలి? ఏ సంస్కృతిని కాపాడాలి, తగవుల్ని తీర్చే పద్ధతి ఏమిటి? ప్రకృతిని ఎలా రక్షించాలి? ఉన్న సమాజాన్ని ఉన్నత సమాజం వైపు ఎలా నడపాలి అనే విషయాలన్నిటి సమాహారమే లోకవిద్య.
6. లోకవిద్య సమాజంలోనే ఉంటూ, ఎల్లప్పుడు వృద్ధి చెందుతూ ఉంటుంది. దీనికి కులాలుగాని, మతాలుగాని, పుస్తకాలు, గ్రంధాలయాలు, కంప్యూటర్లు, ఇంటర్నెట్‌లు, పాఠశాలలు,



కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, మతాలూ, ఆశ్రమాలు, మదర్సాలు లేక మరే ఏ చదువు చెప్పే సంస్థలుగాని, లోకవిద్య అభివృద్ధికి ఆటంకాలు కావు. ఇది నిరంతరంగా సమాజంతో అభివృద్ధి చెందుతూనే ఉంటుంది.

7. ఎప్పటికీ లోకవిద్యాధరుల యొక్క అనుభవాలతో అవసరాలతో మరింత పరిపుష్టం చెందుతూ, ఉన్నత స్థితికి చేరేదే లోకవిద్య.
8. జీవించడానికి అవసరమైన సామాజిక శక్తి లోకవిద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. పరిపాలన, వివిధ రకాల జీవన విధానాలు, ఘర్షణ నివారణ చర్యలు, న్యాయం, ప్రకృతితో మానవ సంబంధాలు అంతిమంగా సమాజంలోని ప్రాపంచిక దృక్పథం లోకవిద్య ద్వారానే సాధ్యపడ్డాయి.
9. శారీరక శ్రమ, మానసిక శ్రమ అనే తేడాలను లోకవిద్య గుర్తించదు. సమాజ అభివృద్ధి కోసం కావల్సిన మానవ మేధస్సుతో చేసే ప్రతీ పనీ సమానమేనని గుర్తిస్తుంది. లోకవిద్య, స్థూలంగా చెప్పాలంటే శారీరక శ్రమచేసే ప్రతీ వ్యక్తిలోను మానవ మేధోసంపత్తి కలిగి ఉండటం వలనే సాధ్యపడుతుందనీ, అందుకే పనిచేసే ప్రతీ వ్యక్తినీ ఒక జ్ఞానిగా గుర్తించాల్సి ఉంటుందని లోకవిద్య నిశ్చితాభిప్రాయం.

ప్రస్తుత దోపిడీ సమాజాన్ని మారుస్తూ నూతన దోపిడీ రహిత లోకవిద్య సమాజంవైపు తీసుకువెళ్ళే జ్ఞానమే లోకవిద్య, అందుకే లోకవిద్య సమాజము, వెనుకబాటుతనం, కుల, మత, ప్రాంత, లింగ, విద్యార్హతలతో సంబంధం లేకుండా దోపిడి లేని నూతన సమాజాన్ని నిర్మించడానికి కృషిచేస్తుంది. ఆత్మగౌరవం, విశ్వాసం, లోకవిద్య కలిగిస్తూ లోకవిద్య సమాజ నిర్మాణానికి తోడ్పడుతుంది. లోకవిద్య సమాజానికి కావల్సిన జ్ఞానాన్ని తరతరాలుగా సంపాదించిన నైపుణ్యాన్ని, కుల, మత, ప్రాంత, లింగ, వర్గ భేదాలకు అతీతంగా నూతన సమాజ నిర్మాణానికి ఉపయోగించాలి. ప్రస్తుతం ప్రభుత్వాలు, రాజకీయపార్టీలతో పాటు స్వచ్ఛంద సంస్థలు చెప్పే సూత్రం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ద్వారా మాత్రమే జ్ఞానం వస్తుందని, ఉన్నత జ్ఞానం, హీనమైన జ్ఞానం అనే తేడాలుంటాయనే భావనను లోకవిద్య సమాజం విశ్వసించదు. ప్రతీ మానవుడు సమాజానికి పనికి వచ్చే పని చేస్తూ కుటుంబ పోషణ కోసం తన జ్ఞానంతో చేసే పనిద్వారా సంపాదించుకునే ప్రతీ వ్యక్తి జ్ఞానవంతుడనీ, తమ జ్ఞానంతో ఈ సమాజంలో ప్రతీ ఒక్కరూ, ఆత్మగౌరవంతో తమ కాళ్ళమీద నిలబడే అవకాశాలు కల్పించడం మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం అనబడుతుందనీ లోకవిద్యా స్వరాజ్యం ప్రగాఢంగా విశ్వసిస్తుంది.

**లోకవిద్య ఆలోచన మరియు నాగరిక సమాజ నిర్మాణం :** ప్రకృతికి లోకవిద్యకు మధ్య ప్రగాఢమైన సంబంధం ఉంది. ప్రపంచంలోని అన్ని జీవుల సమూహమే ప్రకృతి. లోకవిద్య ఆ సమాజంలోని వ్యక్తుల ద్వారా ఉన్నత స్థితికి తీసుకుపోవడానికి ఉపయోగించేది. పుట్టుక, పెరుగుదల ప్రకృతి సహజ గుణాలు. అలాగే లోకవిద్య కూడా నిరంతరం ఉన్నత స్థితి చేరుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది. ప్రజల అనుబంధాలు, అలవాట్లను, తనలో భాగం చేసుకునేదే లోకవిద్య, సామాజిక అవసరాల కోసం నిరంతర మార్పులకు గురయ్యేదే లోకవిద్య. ఉ॥ వెనుకబడిన వారని చెప్పబడే కొంతమంది వ్యక్తులు, కుల, మత, ప్రాంత, లింగ, వర్గ భేదాలకు అతీతంగా తమ పూర్వీకుల

వృత్తి విద్యను వదిలి నూతన సాంకేతిక విధానాలతో ఉత్పత్తి పద్ధతులు స్వీకరిస్తూ, కార్లు, స్కూటర్లు, మోటార్లు లాంటి అనేక నిర్మాణం మరియు మరమ్మతు విభాగాలలో నిష్ణాతులయ్యారు. వీరెప్పుడూ, పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళకపోయినా కూడా లోకవిద్య ద్వారా తమ పనులు తాము చేసుకుంటున్నారు. అతి విపత్కర పరిస్థితులలో, అతి క్లిష్ట సమస్యలకు వీరు తమ అనుభవం ద్వారా పరిష్కారాలను చూపుతున్నారు. గొప్పచదువులు చదివిన వారు కూడా వీరి ముందు అన్ని విధాలా వెనుకబడిన వారిగా మిగిలిపోతున్నారు. ఇది ఒక విచిత్రస్థితి. ఉదాహరణకు ఏ విద్యార్హత లేనివారు అశాస్త్రీయంగా పనిచేస్తున్నారని చెప్పబడుతున్నా, తాపీమేస్త్రీలు, నిర్మాణరంగపు పనివారు ఏ నిష్పత్తిలో సిమెంటు, ఇసుక, కంకర, ఇనుము కలిపితే నిర్మాణం చెయ్యవచ్చో, ఎంత పెద్ద భవన్నానైనా చక్కని ఆకృతితో నిర్మాణం చెయ్యడం దానిని ఊహామాత్రంగా ప్లాన్ గీసి చూపించడం మనం ఈనాడు చూస్తున్నాం. వారి పనులలో నూతన ఆవిష్కరణలను ఏవిధంగా భాగం చెయ్యాలో వీరికి ఎవ్వరూ నేర్పక్కరలేదు. వీరెవ్వరూ పెద్ద చదువులు చదవకపోయినా, పెద్దవారితో సంవత్సరాల తరబడి పనిచేయుట వలన సంబంధించిన 'జ్ఞానాన్ని' వీరు సమకూర్చు కుంటున్నారు. తద్వారా తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ఇక ఆరోగ్యం – పరిశుభ్రత రంగాలకు వస్తే, గ్రామీణప్రాంతంలో లక్షలమంది స్థానిక వైద్యులుగా నాడిని బట్టి ఆ వ్యాధి లక్షణాలను బట్టి, తరతరాల నుండి మందులు ఇవ్వడం, అనేక జబ్బులను తగ్గించడం మనం గమనించాం. వీరెవ్వరూ కూడా రోగులను పీల్చి పిప్పిచేసి దోచుకున్న సంఘటనలు లేవు. వీరి వైద్యం స్థానికంగా దొరికే, చవకగా దొరికే, వంటింట్లోనే దొరికే రకరకాల గింజలు, ఆకులు, మూలికలతో ముడిపడ్డవే. నేటి కళాశాలల నుండి వచ్చిన డాక్టర్లు నిర్దయగా అమానుషంగా అవసరమున్నా లేకపోయినా రకరకాల పరీక్షలు చేస్తూ ఆపరేషన్లు, ఖరీదైన మందులతో ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నారు. ఈ నూతన వైద్యశాలలకు ఎల్లప్పుడూ రోగులు రాకపోతే వారికి నష్టాలు వస్తాయి. కనుకనే నాగరికులైన ఈ ఇంగ్లీషు డాక్టర్లు, నాటువైద్యులపై నిఘా విభాగం పేరుతో ప్రభుత్వ నిఘా అధికారులు, పారంపర్య స్థానిక వైద్యులను వారి వృత్తి నుండి వెళ్ళగొట్టడం వారికి రకరకాల శిక్షలు వేసి వేధించడం ఈ రోజు చూస్తున్నాం. తక్కువ ఖర్చుతో, స్థానిక వనరులతో మన అందరికీ తరతరాలుగా వైద్యం చేస్తున్న భయంకర రోగాల నుండి కాపాడిన నాటువైద్యులు, ఆయుర్వేద వైద్యులు, హోమియోపతి వైద్యులు, సమాజంలోని అందరి మంచిని కోరే పాతతరం వైద్యులే లోకవిద్యా స్వరాజ్యానికి అవసరం. వీరంతా ప్రజలకు వైద్యం చేస్తే అల్లోపతీ వైద్యులు రోగనివారణకి మాత్రమే వైద్యం చేస్తారు. మనిషికి వైద్యంచేసే వీరిని ప్రోత్సహించని ప్రస్తుత ప్రభుత్వం; ఆంగ్ల వైద్యులు కలిసి లోకవిద్య సమాజాన్ని అనాగరికమని పిలువడం హేతుబద్ధతగా లేదు. నూతన ఆవిష్కరణలను తరతరాల జ్ఞానానికి అనుసంధానం చేయడం ద్వారా ప్రజలందరికీ కారుచౌకగా వైద్యం అందుబాటులోకి తీసుకు రావటం ద్వారా విప్లవాత్మక మార్పు ద్వారా లోకవిద్య స్వరాజ్యం స్థాపన జరుగుతుంది.

**ఈ క్రింది మార్గదర్శకాలు లోకవిద్య స్వరాజ్యాన్ని ముందుకు తీసుకువెళ్తాయి :** ప్రకృతి మనకు



ఇచ్చిన భూమి, గాలి, నీరు, అడవి, ఖనిజాలు, ఆకాశం, మీద హక్కు ప్రభుత్వానికి గాని, ఏదైనా ఒక వర్గానికి గాని, ఒక వ్యవస్థకు గాని, ఒక సంస్థకు గాని ఎట్టి పరిస్థితులలోను దఖలు పర్చడానికి లోకవిద్యా స్వరాజ్యం వ్యతిరేకం. ఈ ప్రకృతి వనరులపై హక్కులు, సామాజిక, ఆర్థిక అంశాలపై ఆధారపడి ఉండరాదు. ఏదైనా ఒక విశ్వాసానికి గాని, సిద్ధాంతానికి గాని, అభివృద్ధిపేరుతో ప్రకృతి వనరులపై ఎవరికీ పూర్తి అధికారం ఇవ్వటాన్ని లోకవిద్యా స్వరాజ్యం పూర్తిగా వ్యతిరేకిస్తుంది. వీటిపై హక్కులు స్థానికంగా ఉన్న వివిధ సమూహాలకు మాత్రమే చెందుతాయి. స్థానిక ప్రజలు ప్రకృతి వనరులు అన్నిటిపై హక్కులు కలిగి ఉండి, వాటిని ఏవిధంగా ఉపయోగించాలో నిర్ణయంచేస్తారు.

సమాజంలో అభివృద్ధి అనేది ఒక సిద్ధాంతమో, ఒక మేధావృత్తి ఆలోచనో, ఒక తత్వమో నిర్ధారించలేదు. ఆదేశంలోని స్థానిక సమాజాలు ఎటువంటి అభివృద్ధి కావాలి, వాటికి కావల్సిన వనరులు ఏమున్నాయి, వాటిని ఏ క్రమంలో ఉపయోగిస్తే, ప్రజల అవసరాలు తీర్తాయి, సమాజమంతా అభివృద్ధి చెందుతుంది, అన్నది నిర్ణయిస్తాయి. స్థానిక ప్రజల అవసరాల మేరకు ఎలా ప్రణాళికలు రచించి వున్న వనరులతో సమాజంలోని ప్రజలంతా తమ కుల, మత, ప్రాంత, లింగ, వర్ణ, వయోభేదాలతో ఆర్థిక సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా అందరూ భాగస్వాములుగా ప్రకృతిని రక్షించుకుంటూ, తమ సంస్కృతిని కాపాడుకుంటూ జీవన ప్రమాణాలు పెంచుకుంటూ ముందుకుసాగాలని లోకవిద్య స్వరాజ్యం విశ్వసిస్తుంది.

సమాజాభివృద్ధికి కావల్సిన లక్ష్యం చేరడానికి, కావల్సిన వివిధ పనులు చేయడానికి; సమాజంలోని ప్రతీ వ్యక్తికి తమ కుల, ప్రాంత, లింగ, వర్గ భేదాలతో నిమిత్తం లేకుండా తన జ్ఞానంతో తన కిష్టమైన పనిచేయడానికి, తద్వారా తాను, తన కుటుంబం జీవించడానికి; హక్కు కలిగి ఉండాలి. ఒక పని చేయడానికి సమాజంలో ఒక వ్యక్తికి అతని జ్ఞానం, నైపుణ్యం మాత్రమే ఆధారం. అటువంటి సమాజం ఐక్యతతో పురోగమనంతో పయనిస్తుంది. సమాజంలోని జ్ఞాన సమూహాలు ప్రతీ వ్యక్తి తన లోకవిద్య ఆధారిత జ్ఞానం ద్వారా పనిచేస్తూ సమాజానికి కావల్సిన వివిధ పనులు చేసే అవకాశాలు కల్పించాలి.

జ్ఞానంతో కూడిన నైపుణ్యంలో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే అభిప్రాయానికి తావులేదు. ఏ ఒక్క వృత్తి విద్య, గొప్పదని కాని, హీనమైనదిగాని అనరాదు. విశ్వవిద్యాలయాల్లో చదివిన వారు సమాజంలోని లోకవిద్య ద్వారా బ్రతికే లోకవిద్యాధరుల కన్నా గొప్పవారనే అభిప్రాయాన్ని లోకవిద్య స్వరాజ్యం తిరస్కరిస్తుంది. యుగ యుగాలుగా సమాజ అభివృద్ధికి దోహదపడిన విద్యే లోకవిద్య. ఇది సమాజ అవసరాలకు అనుగుణంగా మార్పులు చెందుతూ, పెరుగుతూ సర్దుబాట్లు చేసుకుంటూ, సమాజంలోని వ్యక్తులందరి మధ్య ప్రేమాభిమానాల్ని పెంపొందించుటకు మాత్రమే ఉపయోగపడుతుంది.

సమాజంలో వ్యవసాయం, వివిధ రకాల వృత్తి విద్యలు, వైద్యం, కళలు, శిల్పకళలు, లలిత కళలు, నాటకాలు, వినోదానికి సంబంధించిన ఇతర కళలలో ఒక్కో సమూహం నైపుణ్యత కలిగి ఉంటాయి. సాధారణంగా ఒక రైతు వైద్యం చేయడంగాని, ఒక వైద్యుడు వ్యవసాయం చేయడంగాని జరగదు. ఇందులో ఏ వృత్తి రెండోదాని కన్నా గొప్పది కాదు. కాని రెండూ

సమాజానికి అత్యవసరాలే.

ప్రతీ ప్రాంతంలోనూ అచ్చటి మొక్కలు, పక్షులు, పశువులు మొదలైన జీవులన్నిటినీ సామాజిక అవసరాల కోసం, వారి మధ్య సంబంధ బాంధవ్యాలు ఎలా ఉండాలి? వారు ఒకరిపై ఒకరు ఆధారపడటం వారు సమాజానికి చేసే సేవలు; ప్రకృతినీ, వాతావరణాన్నీ ఎలా రక్షించాలి మొదలైనవన్నీ వీటినన్నిటికి సంబంధించిన స్థానిక విద్యే లోకవిద్య. ప్రతీ వ్యక్తికీ జీవించే హక్కు, స్వతంత్రం, జ్ఞానం సంపద, మరియు సంపాదించుకునే హక్కు ఉండాలి. ఏ తత్వమైనా, ఏ భావజాలమైనా, ఏ ప్రాపంచిక దృక్పధమైనా, ఏరాజ్యాంగమైనా ఆఖరికి లోకవిద్య అయినా నిరంతర సమాజపు అభివృద్ధికీ, మానవ వికాసానికీ స్వతంత్రతకు అభివృద్ధికీ ఆటంకం కలిగిస్తే వాటిని ప్రజలు తిరస్కరించక తప్పదు. సమాజంలో అందరికీ అంగీకారమైన పద్ధతిలో ఎవరైనా, ఏ జ్ఞానాన్నైనా సంపాదించుకొని, తద్వారా తన వ్యక్తిగత జీవితాన్ని సౌఖ్యవంతంగా నడుపుకొనే హక్కు కలిగి ఉండాలి.

నేటి సైన్సు అని చెప్పబడే శాస్త్రం ప్రతీ సంఘటనకి, ప్రతి అనుభవానికి నిరూపణ కావాలని డిమాండ్ చేస్తుంది. కాని మన నిజ జీవితంలో కొన్నిటికి ఎటువంటి నిరూపణ లేకుండా, ఎటువంటి శాస్త్ర సమ్మతి లేకుండా, ఎటువంటి వివరణ, పరిశీలన లేకుండా జరిగే సంఘటనలు అనేకం ఉన్నాయి. అందుచేత ప్రతి ఘటనకు శాస్త్రీయ విశ్లేషణ, అంగీకారం కావాలనే విధానం మానవ అభివృద్ధికి ఉన్నత నాగరిక సమాజ నిర్మాణానికి ఆటంకాలవుతాయి. ప్రపంచంలో మానవుడు చేసే ఏ పని కూడా శారీరక శ్రమగాని, మానసిక శ్రమగా గాని విభజించటం తప్పు. ప్రతీ పని శారీరక, మానసిక శ్రమల సహకారంతో మాత్రమే జరుగుతాయని అర్థం చేసుకోవటం అవసరం. అందుచేతనే ఏ శ్రమ కూడా మరొక శ్రమ కన్నా ఉన్నతమైనది కాదు.

ఉన్నత జ్ఞానవంతమైన సమాజ నిర్మాణం జ్ఞానవంతమైన ప్రజల ద్వారా మాత్రమే నిర్మింపబడి లోకవిద్య స్వరాజ్య స్థాపనకు దోహదపడుతుంది.

**లోకవిద్య స్వరాజ్యానికి సామాజిక ప్రాతిపదిక :** ప్రజాస్వామ్య బద్ధమైన లోకవిద్య సమాజమే లోకవిద్య స్వరాజ్యాన్ని స్థాపించ గలుగుతుంది. ఇక్కడ లోకవిద్యాధరులందరూ ప్రజాస్వామ్య బద్ధంగా జీవిస్తారు. లోకవిద్యాధరులందరూ పాల్గొంటేనే ఈ ప్రజాస్వామ్యం వర్ధిల్లి లోకవిద్య స్వరాజ్యం మన గలుగుతుంది. ఈ సమాజానికి మూలస్తంభాలు, సామాన్య మానవుల్లోని లోకవిద్య, లోకవిద్య ఆధారిత జీవన విధానం, ఉత్పత్తులు, అలవాట్లతో పాటు లోకవిద్య సమాజం మీద అత్యంత విశ్వాసం కలిగి వుండడం. ఈ కింది సామాజిక అంశాలు ఈ సమాజాన్ని నడిపించడానికి ఆధారభూతమై ఉంటాయి.

**1) లోకవిద్యా సమాజంలో స్త్రీ-పురుషుల మధ్య సంబంధాలు:** మన సమాజంలో ప్రధానంగా స్త్రీ పురుషులు అనగానే భార్యాభర్తల సంబంధాలు గుర్తుకొస్తాయి. కుటుంబ వ్యవస్థలో భార్యాభర్తల సంబంధాలు, సమాజంలో కుటుంబాలు ప్రధానమైన పాత్ర వహిస్తాయి. భార్యాభర్తల మధ్య ఏ రక్తసంబంధం లేకపోయి నప్పటికీ వారి సంబంధం. మానవ జాతి సంబంధాలలో అత్యుత్తమమైన సంబంధం. దీనినుంచే కుటుంబ సంబంధాలు ప్రారంభ మవుతాయి. వారిద్దరిమధ్య ఎటువంటి అరమరికలు లేక మొత్తం కుటుంబాన్ని అభివృద్ధి పరచడమనే ఏకైక



లక్ష్యంతో పనిచేస్తారు. భార్యభర్తల మధ్య పని విభజన కానీ, ఒకరెక్కువ తక్కువ అని కానీ నా ఆస్తి, నీ ఆస్తి అని కానీ ఎన్నడూ చర్చించబడదు. వారిద్దరు వారి కుటుంబ సంక్షేమం గురించి, అభివృద్ధి గురించి, ఆస్తి గురించి, నైపుణ్యాల గురించి సంపూర్ణమైన అవగాహహన కలిగి ఒక బండికి రెండు చక్రాల్లా ప్రతీ పనిలోనూ మనం ఇరువురు అనే విధంగా పనిచేస్తారు. ఇటువంటి ఉత్తమ విలువలు కలిగిన సంస్కృతి, శీలం, సత్ప్రవర్తన, ఉన్న కుటుంబాలు ఉన్నత నాగరిక సమాజ నిర్మాణానికి దోహద పడ్తాయి.

**2) సమాజంలో స్త్రీల హోదా :** ఈ రోజు స్త్రీల హోదా కుదింపబడి తెరవెనుకకు తోసి వేయబడింది. గ్రామంలో, పట్టణంలో, నగరంలో, అడవిలో మరెక్కడైనా ఆమె ఏ పనిలో వున్నా ఆమె ఉద్యోగినిగా ప్రభుత్వంలో గానీ, ఇతరత్రా గానీ ఆమె సంప్రదాయంగా కాని లేదా ఆధునికంగా నివసించినా ఎటువంటి విలువలు పాటించినా చాలా కాలంగా ఆమెకు మనం సమానంగా, ధర్మంగా, న్యాయంగా కుటుంబ వ్యవస్థలో స్త్రీలకిచ్చిన గౌరవాన్ని ఈ రోజు సమాజ పరంగా ఇస్తున్నామా? అంటే లేదనే చెప్పాలి.

మానవ సమాజంలో స్త్రీలు కూడా ముఖ్యమైన సభ్యులనే సత్యాన్ని గుర్తించాలి. మానవ సమాజ నిర్మాణంలో వారు సహాయపడతారనే అవగాహన శుద్ధ తప్పు. వారు కూడా సమానంగా సమాజాభివృద్ధిలో దాని విలువలు, సంస్కృతి కాపాడటంలో భాగం వహిస్తున్నారనేది సత్యం. ఈ భావన మాత్రమే వారి కుటుంబ అభివృద్ధికి తోడ్పడుతుంది. అలాగే ఆమె భాగస్వామ్యం లేకుండా అనేక కుటుంబాల సమూహమైన ఈ సమాజాభివృద్ధి సాధ్యం కాదు. కుటుంబ ఉన్నత స్థితిలోనూ, దయనీయ స్థితిలోనూ ప్రతి స్త్రీ కూడా తన కుటుంబం కోసం రాత్రింబవళ్ళూ ఆలోచిస్తూ, పనిచేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక కుటుంబ అభివృద్ధి ఆ ఇంట్లో స్త్రీలపై ఆధారపడి వుంటుంది. స్త్రీలు లేని కుటుంబాలు కానీ, సమాజాలు కానీ మనం ఊహించలేము. ఏ సమాజంలోనయితే పద్ధతిగా విలువలతో జీవించే కుటుంబాలు వుంటాయో ఆ సమాజంలో స్త్రీలకు ఇచ్చే ప్రాధాన్యం, సామాజిక గుర్తింపు వేరుగా ఉంటాయి. స్త్రీ మాత్రమే కుటుంబ ఆదాయ వ్యయాలు తెలుసుకుని సభ్యుల వివిధ అవసరాలు, దానికి కావల్సిన వనరుల లభ్యతను కుటుంబాన్నంతటినీ కలిపి సుఖసంతోషాలతో గౌరవ ప్రదంగా ఎల్లప్పుడు వుంచటానికే కృషి చేస్తుంది. కుటుంబ రక్షణకు సమాజ రక్షణకు, కుటుంబంలోనూ, ప్రజాజీవితంలోనూ స్త్రీ పాత్ర ఎవరికీ తక్కువ కాదు, చదువుకున్న స్త్రీలలో కొందరు పోలీసు, సైనిక అధికారులుగా, బ్యాంకు ఉద్యోగులుగా, కార్యాలయ సిబ్బందిగా లేదా మరో ఉద్యోగంలో స్థిరపడి వుండొచ్చు కానీ లోకవిద్యా సమాజంలో ఉండే స్త్రీలందరిదీ ప్రధాన పాత్ర, వారి కృషి ఈ క్రింది మాటల్లో వివరించవచ్చు.

స్త్రీలందరూ ప్రధానంగా లోకవిద్యాధరులే. వారందరికీ కుటుంబమనే వ్యవస్థపై, పిల్లల పెంపకంపై సంపూర్ణ అవగాహన ఉన్నది. వారి జ్ఞానాన్ని ఏ నాగరిక సమాజం కూడా తిరస్కరించ జాలదు. ప్రస్తుత నూతన సమాజం, జ్ఞాన ప్రపంచాలు స్త్రీల జ్ఞానాన్ని చిన్నచూపు చూడడానికి ఎంత ప్రయత్నించినా అదివారి వల్ల కానేకాదు. వ్యవసాయంలో, చేతి వృత్తులలో, అటవీ పెంపకంలో మరియు ఇతర జీవనాధార వృత్తులలో వున్న కుటుంబాలలోని స్త్రీలు తమ కుటుంబాల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహించడం, వారు కూడా లోక విద్యాధరులుగా వుండడం మనం

గమనించవచ్చు.

ప్రకృతి సహజమైన వాతావరణ పరిస్థితుల గురించిన అవగాహన స్త్రీలకు సహజంగా వుంటుంది. ఈ జ్ఞానమంతా ప్రతీ స్త్రీ తమ తర్వాత తరాల వారికి తప్పకుండా బోధించి కుటుంబ రక్షణకు, సమాజ రక్షణకు తోడ్పడడం మనమంతా చూస్తున్నాం. ఈ విధంగా స్త్రీలు మానవ సమాజంలో వారియొక్క జ్ఞాన ఆధారిత పనుల ద్వారా తమకంటూ ఒక ప్రత్యేకత సంతరించుకున్నారు.

కుటుంబం కోసం దైనందిన కార్యకలాపాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య సూత్రాలు, వివిధ రకాల వంటకాల తయారీ, కుట్టుపనుల్లో సమాజంలోని సుమారుగా అందరూ స్త్రీలు భాగస్వాములవడం చూస్తున్నాం. ఇవి “ఇంటి నిర్వహణ, పరిరక్షణ”లో ఇతరులకు నేర్పడం ద్వారా ప్రతీ ఇల్లు ఒక బోధనా సంస్థగా, నేర్చుకునే సంస్థగా, పరిశోధనా సంస్థగా ఉన్నాయని చెప్పవచ్చు. భారతదేశ సంస్కృతి మరియు అలవాట్లు గురించి చర్చించే సందర్భంలో ఇతరులు లోపాల్ని, తప్పులు, చెడు అలవాట్లు గురించి ఎంత వేలెత్తి చూపించినా, మనదేశంలోని మంచి అంతా తరతరాలుగా కాపాడుకుంటూ వచ్చింది స్త్రీలనే విషయం వారు కూడా గుర్తించారు. ఏనాడైతే స్త్రీల జ్ఞానానికి సరైన గౌరవం ఇవ్వడం జరుగుతుందో సమాజంలో వివిధ వ్యక్తుల మధ్య సామాజిక సంబంధాలతో పాటు ఆర్థిక సుస్థిరత కూడా ఏర్పడుతుంది.

లోకవిద్య స్వరాజ్యంలో ప్రాథమికంగా ప్రతీ స్త్రీ కూడా ఒక జ్ఞాన ఖని అని గుర్తించడం జరుగుతుంది.

**3) ఆదివాసీలు, రైతులు, వృత్తి విద్యాధరులు :** ఆదివాసీలు, రైతులు ప్రతీక్షణం ప్రకృతితో సంబంధం కలిగి దానిపై ఆధారపడి జీవిస్తుంటారు. మిగతా సమూహాలు ప్రకృతితో ఇంత దగ్గరగా వుండే అవకాశాలు తక్కువ. మనదేశంలో ప్రవేశపెట్టబడిన హరిత విప్లవం వీరి బ్రతుకులను ఛిద్రం చేసింది. చాలా మందికి ఈ సంస్కృతితో ప్రకృతిలో పెనుమార్పులు సంభవించటంతో తమ ప్రాంతాల నుండి వెళ్ళవలసిన పరిస్థితులను వారి ప్రాంతాల నుండి వెళ్ళగొట్టడానికీ దారితీసింది. వ్యవసాయం, అటవీ సంపద ప్రకృతి సంపదగా చూడడం మానేసి మరింత పంట దిగుబడి, అటవీ ఉత్పత్తి ద్వారా సంపాదన అనే అభివృద్ధి నమూనా పేరుతో తరతరాల వారి శాంతియుత జీవితాలను, తలరాతలను మార్చివేసింది. ఈ నూతన అభివృద్ధి విధానం వారి మధ్యలో విభేదాలను, అసూయను పెంచి అమానవీయులుగా తయారుచేసింది. చేతివృత్తుల వారు ఆదివాసీల, రైతుల మీద ఆధారపడి తమ ఉత్పత్తులు చేసేవారు. హరిత విప్లవం వీరి ఉపాధిని కూడా దెబ్బకొట్టింది. లోకవిద్య ఆలోచన విధానం తమ పారంపర్య జీవితాల నుండి వెళ్ళగొట్టబడే అభివృద్ధిని ఆహ్వానించక పోగా వ్యతిరేకిస్తుంది.

భూమ్మీద ప్రకృతి సంపదను మానవులెవ్వరూ సృష్టించలేదు కనుక ప్రభుత్వానికి గానీ, సమాజానికి గానీ మరే వర్గానికి గానీ వీటి మీద సంపూర్ణ అధికారం వుంటుందనే సిద్ధాంతాన్ని లోకవిద్య స్వరాజ్యం వ్యతిరేకిస్తుంది. ఈ ప్రకృతిలోని జీవులు, నిర్జీవులు ఒకరు ఎక్కువగా, ఇంకొకరు తక్కువగా గానీ చూడ కూడదు. వీటి మధ్య సంబంధం తల్లిబిడ్డల వంటింది. ప్రకృతిని నాశనం చేయడమంటే జీవుల్ని, నిర్జీవుల్ని కూడా నాశనం చేయడంతో సమానం. ప్రకృతికి



విలువ కట్టడం, విలువ ఆధారితంగా దాన్ని నాశనం చెయ్యడం తప్పు. ప్రకృతిలోని వివిధ అంశాలు మానవుడు సృష్టించలేదు కనుక దానికి విలువ కట్టడం తప్పు. మనకి ముందుతరం మనకిచ్చిన ప్రకృతిని తర్వాతి తరాలకు అందివ్వడం మన బాధ్యత.

ఇతర ఆలోచనా విధానాలను, జ్ఞానాన్ని, సంస్కృతిని వ్యతిరేకిస్తూ తమ ప్రత్యేక భావజాలం మరియు సంస్కృతి గొప్పవనే ప్రతీ ప్రభుత్వం చివరకు దోపిడీ వ్యవస్థగా తయారయి అణచి వేసే ప్రభుత్వంగా తయారవడం చూస్తున్నాం. అభివృద్ధి నినాదంతో తమ జ్ఞానం మీద ఆధారపడి బ్రతికే లోకవిద్యాధరుల ఉపాధిని పోగొట్టి వారందరిని ఉపాధిహామీలో కూలీలుగా, రాయితీలడిగే బిచ్చగాళ్ళుగా రైతులను, వృత్తి విద్యాధరులను వారి వృత్తుల నుండి వెళ్ళగొట్టే ప్రభుత్వం నాగరికమైనదని, అభివృద్ధికరమైనదని చెప్పడం శుద్ధ తప్పు.

ప్రస్తుత ప్రభుత్వ విధానాలు కమ్మరి వృత్తి వారిని వారి వృత్తి నుండి వెళ్ళగొట్టడానికి దోహదపడ్డాయి. వివిధ ఖనిజాలతో, రకరకాల పాత్రలు, పనిముట్లు తయారుచేసే వారంతా ప్రభుత్వ విధానాలతో వారి నియమ నిబంధనలతో వృత్తి విద్యల నుండి దూరం కావలసి వస్తోంది. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో ప్రకృతి విధ్వంసం జరుగుతోంది. కమ్మరుల ఉపాధి పోయింది. రైతుల, కమ్మరుల, ఆదివాసీల మధ్య మంచి సమన్వయంతో పనిచేస్తే వారి అభివృద్ధి సాధ్యమే. భూమి నుండి రైతుల్ని, అడవి నుండి ఆదివాసీలను, వృత్తుల నుండి వృత్తిదారులను తరిమేయడ మంటే కుటుంబాల నుండి వ్యక్తులను విడదీసి వైరుధ్యాలు సృష్టించడం. తన జ్ఞానం ఆధారిత జీవన విధానాన్నుంచి ఎవరైతే వెళ్ళగొట్టబడుతారో వారికి ఎటువంటి ఉపాధి హామీ కల్పించినా చేసే పనికి వారి జ్ఞానం నిరుపయోగంగా మారినపుడు జీవితం అర్థంలేనిదిగా తయారౌతుంది. సమాజంలో ఒకరిపై మరొకరు ఆధారపడి తరతరాలుగా జీవిస్తున్న ఈ సమాజమే నేడు ముక్కలైపోతోంది. తమ వృత్తి విద్య నైపుణ్యాలను వదులుకొని తమ ప్రాంతంలోనే కూలీలుగాను, బిచ్చగాళ్ళగానో వుండలేని వారు వలసపోయి పట్టణ ప్రాంతంలో అతి దీనంగా అవమానాలకు గురౌతూ నిస్సారంగా జీవిస్తున్నారు. ఈ పరిస్థితిని ప్రస్తుత అభివృద్ధి నమూనా సృష్టించినప్పటికీ అదే నమూనాను ఆశ్రయించిన అన్ని రాజకీయ పార్టీలు వీటి పరిష్కారానికి ప్రజలను కుల, మత, ప్రాంతాల ఆధారంగా ముక్కలు చేసి ఓట్ల రాజకీయాన్ని నడుపుతున్నాయి. ఈ రోజు తమ ప్రాంతం నుండి నిర్వాసితులైన వారికి లక్షల్లోనో, కోట్లలోనో నష్టపరిహారం ఇచ్చినప్పటికీ ఇన్ని రోజులు అక్కడి ప్రకృతిపై ఆధారపడి తమ జ్ఞానంతో ఉత్పత్తులు చేసి జీవించిన వారు పునరావాసంలో కూలీలుగాను, వాచ్‌మెన్లుగానూ, ఒకవేళ కొద్దిగా డబ్బువున్నా ఆత్మను కోల్పోయిన జ్ఞానిగానూ జీవిస్తున్నారు. వారు జీవితాంతం పోగొట్టుకున్న ప్రాథమిక విలువలను ఏ నష్టపరిహారంతోనూ పూడ్చలేము. నాగరికత అంటే ప్రతీ వ్యక్తి సంపూర్ణ జీవనాన్ని సాగిస్తూ సమాజానికి తన జ్ఞానం ద్వారా, నైపుణ్యం ద్వారా, శ్రమశక్తి ద్వారా అంతిమంగా తన సృజనాత్మకతతో తోడ్పడటమే.

లోకవిద్య స్వరాజ్యం రైతుల, వృత్తిదారుల, ఆదివాసీల జీవన విధానాలను వారి అలవాట్లను, సంస్కృతిని, సంపాదించే జ్ఞానాన్ని గౌరవిస్తూ సమాజానికి వారి సహయ సహకారాలను సంపూర్ణంగా అందించడానికి తోడ్పడుతుంది. దీనికి కావల్సింది నిజమైన ప్రజాస్వామ్యం ప్రతీ

ఒక్కరికి తన జ్ఞాన ఆధారితంగా జీవించడానికి అవకాశం, హక్కు ఉండాలని విశ్వసిస్తోంది. ప్రతీ జ్ఞానికి తన జ్ఞాన ప్రదర్శనకు సమాజంలో అవకాశం ఇస్తూ దాని ఎదుగుదలలో అందరూ భాగస్వాములయ్యే అవకాశం ఇవ్వాలని విశ్వసిస్తోంది.

**4) దళిత సమాజం :** దళిత సమాజంలో ప్రధానంగా వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు మరియు వృత్తి విద్యాధరులతోపాటు వివిధ రకాల సేవలు చేసే వ్యక్తులు ఉంటారు. వీరి ప్రత్యేకత ప్రకృతిని రక్షించడం మరియు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా వుంచడం. వీరు ప్రధానంగా గ్రామాలలో గానీ పట్టణాల్లో గానీ పారిశుద్ధ్యంలో పనిచేయడానికి సంకోచించరు. వీరులేకపోతే మానవ జాతికి అంటువ్యాధులు ప్రబలి ముప్పు కలిగి వుండేది. అతి దుర్మార్గమైన సామాజిక రుగ్మత ఏమిటంటే కొద్ది కాలం క్రితం వరకు వీరిని అంటరాని వారుగా, అపరిశుభ్రులుగా చూస్తూ సమాజం నుండి దూరంగా వెళ్ళగొట్టి దోచుకోవడం జరిగింది. ఇది భారత సమాజం మీద ఎన్నటికి చెరిగిపోని మచ్చ. వీరందరి ఉద్ధరణకు స్వతంత్ర భారతదేశంలో ప్రతీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు కనిపించినా వారిని ఓటు బ్యాంక్‌గా మాత్రమే ఉపయోగించారు లేదా కొద్దిమంది దళిత నాయకులు బాగుపడినా వీరందరూ పేదరికం నుండి విముక్తి చెందలేదు. వీరిని జ్ఞానులుగా గుర్తించి సమాజాభివృద్ధిలో వారి జ్ఞానం ద్వారా పాలుపంచుకునే వృత్తులలో పనిచేసే అవకాశం కల్పిస్తూ వారి అభివృద్ధికి సమానత్వానికి లోకవిద్య స్వరాజ్యం కృషిచేస్తుంది.

**5) వివిధ మతాల మధ్య సహకారం :** భారత సమాజాన్ని హిందువులు, (వేద మరియు వేదాంతులు) క్రైస్తవులు, మహ్మదీయులు, బుద్ధిస్టులు, జైనులు, సిక్కులు, పార్శీలు మొ॥వారుగా విభజింపబడ్డారు. ఇంకా ఆదివాసీలు ప్రత్యేక మత విశ్వాసాలు కలిగి వుంటారు. వీరితోపాటు నాస్తికులు, సంశయవాదులు, శాస్త్రీయ దృక్పథం కలిగినవారు, హేతువాదులు ఉన్నారు. సమాజ అభివృద్ధి కోసం వీరందరి మధ్య సమన్వయం అవసరం. ప్రతీ మతము ఆర్థిక, సాంఘిక, సమానత్వం కోసం మాట్లాడతాయి. తమ నమ్మకాలు, విశ్వాసాలు మాత్రమే అని అనకుండా అందర్నీ గౌరవించడం అవసరం. వివిధ మతస్తుల మధ్య ఘర్షణాత్మక వాతావరణాన్ని నివారించి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అసమానతలను తొలగించాలి. ప్రతీ ఒక్కరూ తమ మత విశ్వాసాలకు సంబంధించిన పుస్తకాలే కాక ఇతర మతాల గూర్చి కూడా తెలుసుకొని సమాజానికి వ్యతిరేకమైన విషయాలను త్యజించి అన్నీ గ్రంథాలను అవసరమయితే పునర్ నిర్వచించడానికి ప్రయత్నం చేయడం ద్వారా మత సామరస్యం సాధించవచ్చని లోకవిద్య స్వరాజ్యం విశ్వసిస్తోంది.

**గ్రామ పంచాయితీలు - ప్రజాప్రతినిధులు :**

లోకవిద్య స్వరాజ్యంలో పంచాయితీలకే అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. కానీ ప్రస్తుతం వున్న గ్రామ పరిధిలో వున్న పంచాయితీల స్థానే మూడు రకాల పంచాయితీలు అదే పరిధిలో పనిచేస్తాయి. మొట్టమొదటిది జ్ఞాన పంచాయితీ, రెండవది మహాపంచాయితీ, మూడవది సామాజిక పంచాయితీ. ఈ పంచాయితీల గురించి స్థూలంగా వాటి ఏర్పాటు, పంచాయితీలలో వివిధ వర్గాల పొందిక చివరగా వాటి విధివిధానాలు ఈ క్రింది విధంగా వుంటాయి.



**1) జ్ఞానపంచాయితీ :** లోకవిద్య స్వరాజ్యంలో అత్యంత ఉన్నత స్థానంలో జ్ఞానపంచాయితీ వుంటుంది. మొత్తం లోకవిద్య స్వరాజ్యానికి ఇది గుండెకాయ. ఈ రోజు ప్రతీగ్రామంలో వివిధ వృత్తులు, వ్యవహారాలు చేసే బృందాలు వున్నాయి. అటువంటి ప్రతీ బృందంలోను ఒక జ్ఞాన పంచాయితీ వుంటుంది. (కుల మరియు వృత్తి పంచాయితీలు) సామాజిక అభివృద్ధిలో ఇటువంటి జ్ఞానపంచాయితీ, విధివిధానాలు, దృక్పథం ఈ క్రింది విధంగా వుంటాయి.

- రైతుల జ్ఞానపంచాయితీలో ధాన్యాలు, పప్పులు, పండ్లు, కూరగాయలు, పువ్వులు, పశువులు, పక్షులకు సంబంధించిన ఉత్పత్తుల వారందరూ ఇందులో సభ్యులుగా వుంటారు.
- అడవి నిర్వహణా సంపద దానికి సంబంధించిన వృత్తి విద్యలు చర్చించేది ఆదివాసీల జ్ఞానపంచాయితీ.
- వ్యవసాయ కార్మికులు, వివిధ వృత్తిదారులు, గ్రామంలో పరిశుభ్రత, స్వచ్ఛత అంశాల గురించి చర్చించడానికై ఈ బృందంలో పనిచేసే వారి జ్ఞానపంచాయితీ.
- కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, సాలి, తాపీపని దారుల నుండి వృత్తిదారుల పంచాయితీ.
- ఇంటినిర్వహణ, శిశుసంరక్షణ, విద్య, కార్యాలయాల పారిశ్రామిక వాడల నిర్వహణ అంశాలపై స్త్రీల పంచాయితీ.
- చిరువర్తకులు, పెద్ద వర్తకుల పంచాయితీ.
- వైద్యం, మందులు, ఆరోగ్యరక్షణ అంశాలపై ఆ వృత్తిదారుల పంచాయితీ

వివిధ బృందాలతో ఏర్పడిన ఈ జ్ఞాన పంచాయితీలు వృత్తులలో, ఉత్పత్తులలో, సేవలలో వుండే సాధక బాధకాల గురించి చర్చించడంతోపాటు నివారణ, నిర్వహణా పద్ధతులను కనుగొంటాయి. వారి బృందంలోని వారి వృత్తులకు కావల్సిన మెలకువలతోపాటు, సామర్థ్యం పెంపొందించడానికి అవసరమైన జ్ఞానాన్ని ఇవ్వడానికి వ్యవస్థలను ఏర్పాటు చేసి అటువంటి ఇతర వ్యవస్థలతో సహకరించుకుంటూ అభివృద్ధికి తోడ్పడతారు.

**2) మహాపంచాయితీ :** ప్రతీ జ్ఞానపంచాయితీ నుంచి ఎన్నుకోబడ్డ ప్రతినిధులతో మహాపంచాయితీ ఏర్పడుతుంది. ఈ పంచాయితీ ఉత్పత్తి, వినిమయ విధి విధానాలను నిర్ణయించడంతోపాటు దానికి కావల్సిన వనరులను సేకరిస్తుంది. ఈ మహాపంచాయితీ ఉత్పత్తి, సేవా విభాగాలలో పనిచేసే గౌరవప్రదమైన జీవితానికి అవసరమైన వేతనాలు దొరికే విధంగా ప్రతీ పనికీ, వస్తువుకు, ఉత్పత్తికి ధర నిర్ణయించడానికి నియమాలు రూపొందిస్తారు. మహాపంచాయితీలు ఎల్లవేళలా అందరికి గిట్టుబాటుధర/వేతనం వచ్చే విధంగా ధరలు సవరించడానికి నిర్ణయాలు తీసుకుంటునే వుంటుంది.

**3) సామాజిక పంచాయితీ :** సామాజిక పంచాయితీ ఆచారణాత్మకమైన అనుభవంలో రాటుదేలిన వారితో నిర్మింపబడుతుంది. ఈ పంచాయితీలలో ప్రతీ బృందం నుంచి అత్యంత గౌరవనీయులందరినీ లోకవిద్య సమాజ నిర్మాణానికి కృషిచేసే వారందరితో ఏర్పడుతుంది.

వారి ప్రధాన వ్యాపకం వివిధ బృందాల మధ్య సౌభ్రాతృత్వం, న్యాయం ఇరుపక్షాల వారికి సమధర్మం కలిగించే విధంగా పనిచేసే వారందరితో అన్నీ బృందాల నుండి ప్రాతినిధ్యం ఉంటుంది. వారు ఈ క్రింది అంశాలపై పనిచేస్తారు.

- శాంతిభద్రతల పరిరక్షణ
- లోకవిద్యాధరుల పిల్లలకు వారి నిర్ణయం మేరకు వారికి కావల్సిన వృత్తివిద్య నైపుణ్యాలు నేర్పే విద్యా విధానాన్ని నిర్వహించడం.
- వివిధ స్థానిక జానపద కళారూపాలను, సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించి వాటి నిర్వహణకు, అభివృద్ధికి, విస్తరణకు దోహదపడతారు.

భూమ్మీద ఏ మనిషి నేరగాడుగా కానీ మానవ వ్యతిరేక ఆలోచనలతోగానీ, ఫక్తు స్వలాభం కోసమే గానీ పుట్టలేదు. తన చుట్టుపక్కల సామాజిక వాతావరణం మరియు అత్యాశ మానవుడిని నేరప్రవృత్తి వైపు నెడుతుంది. దీనికి నివారణోపాయం సమాజం మానవ విలువల మీద నమ్మకాన్ని పెంచే నిర్ణయాలు అమలు చేస్తేకానీ మానవుడు సన్మార్గం వైపు నడవడు. ఉదా : నేటి వినిమయ సంస్కృతి, ధనదాహం మానవుడిలోని మానవత్వాన్ని మరచి, మానవ సంబంధాల నిర్మాణం, నిర్వహణ వైపుగానీ వెళ్ళనివ్వడం లేదు.

ప్రతీ మనిషికీ ఈ సమాజంలో గుర్తింపు తను నివసిస్తున్న కుటుంబం ద్వారాను, తన బంధువర్గాలవారందరూ, వారు చేస్తున్న వృత్తిద్వారా గుర్తింపబడుతున్నారు. గుర్తింపు అంటే ఆమె/అతను నేపథ్యం, వ్యక్తిత్వం, చొరవ మరియు సృజనాత్మకత. ఈ సామాజిక గుర్తింపుకు బయట వ్యక్తులకు ఎటువంటి గుర్తింపు వుండదు. ఎవరైతే ఇటువంటి గుర్తింపు పొంది గౌరవంతో బతకలేరో వారిని సామాజిక బహిష్కృతులు గాను, నేరస్తులు గాను గుర్తింపబడతారు. నేరం ఆస్తులకు సంబంధించినదో, స్త్రీలపై అత్యాచారం ద్వారానో, వరకట్నం కోరటం ద్వారానో, ఇతర కులమతాలను దూషించడం ద్వారానో నేరస్తులుగా గుర్తింపబడతారు.

ప్రస్తుత న్యాయ వ్యవస్థ అసలు ఏం జరిగిందో మరియు ఏమీ జరిగి వుండవచ్చో అని ఆలోచించకుండా న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టిన సాక్ష్యులను బట్టి నిర్ణయించడం జరుగుతోంది. తప్పు చేసాడని చెప్పబడే వ్యక్తి జీవన విధానం, అతని జ్ఞానం, అతని సామాజిక, సాంస్కృతిక నేపథ్యం, అతను జీవించే పరిసరాలు, వాటి స్థానిక పరిస్థితులు కూలంకషంగా చర్చించకుండా అతను నేరం చేసాడని నిర్ణయించడం ధర్మమేనా? ముద్దాయికి తెలియని పోలీసులు, పబ్లిక్ ప్రాస్యిక్యూటర్, మరియు సాక్షులు చెప్పిన దానిని విశ్వసించి అతనిని శిక్షించుట ధర్మమా? అందుకే ప్రస్తుత న్యాయవ్యవస్థ గుడ్డిదేకాక గుడ్డి నమ్మకాలపై ఆధారపడి ఉంది.

స్థానిక పెద్దలు, కుటుంబముతో కూడిన పంచాయితీలో న్యాయం చేయలేకపోతే బయటవున్న వ్యవస్థ కూడా న్యాయం చేయజాలదని అందరికి తెల్సిందే. ఆ విధంగానే స్థానిక తగాదాలు/వివాదాలు స్థానిక పంచాయితీలలో ధర్మంగా పరిష్కరించబడటానికి ప్రధాన కారణం ఇరుపక్షాల నేపథ్యం వారి సామాజిక అవగాహనతో పాటు సాక్ష్యాధారాలు తీసుకొని నిర్ణయం చేయడం జరుగుతుంది. అందుకే సామాజిక పంచాయితీలు విచారణ జరిపి అవగాహనతో కూడిన



తీర్పు ఇవ్వడం ధర్మబద్ధమైనది. స్థానిక సామాజిక పంచాయితీ వివిధ బృందాల నుండి రావడంవల్ల వారు సామాజిక, ఆర్థిక బలాలను బట్టి తీర్పులివ్వకుండా నిష్పక్షపాతంగా ఇవ్వడం జరుగుతుంది. ఎక్కడైనా నేరం జరిగినట్లు నిరూపణ అయితే అది పునరావృతం కాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను సామాజిక పంచాయితీలో చర్చించి, ఆ నేరంలో భాగస్వాములందరిని విచారించి, న్యాయాన్ని-ధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని ఏకాభిప్రాయంతో శిక్షించడం జరుగుతుంది. అన్యాయం జరిగిందని భావించిన వ్యక్తికి సామాజిక పంచాయితీలోనే పునర్విచారణ కోరే హక్కు వుంటుంది.

సామాజిక పంచాయితీ జీవనోపాధి కోసం కావాల్సిన నైపుణ్యాన్ని తాము నిర్మించిన విద్యాలయాలు, శిక్షణా తరగతుల ద్వారా అందరి విద్యార్థులకు కుల, మత, జాతి, లింగ భేదం లేకుండా శిక్షణ ఇస్తుంది. తర్వాత పంచాయితీ శిక్షితులందరికీ స్థానిక శిక్షణ తర్వాత ఉన్నత శిక్షణకు వెళ్ళేవారికి వృత్తి విద్యలోనే కాక సాంస్కృతిక, లలిత కళలలో నిష్ణాతులయ్యే ఏర్పాటు చేయడం జరుగుతుంది.

ప్రస్తుత పంచాయితీరాజ్ వ్యవస్థ ఇంకా నిర్మాణ దశలోనే వుంది. ఇది ఆరోహణక్రమంలో మూడుభాగాలుగా విభజింపబడింది. అవి గ్రామపంచాయితీ, పంచాయితీ సమితి, చివరగా జిల్లా పరిషత్తు.

గ్రామ పంచాయితీ సాధారణంగా ఒక గ్రామాన్ని లేదా కొన్ని చిన్న చిన్న గ్రామాలను కలిపి ఓటర్ల సంఖ్య ఆధారంగా ఏర్పరచడం జరిగింది. గ్రామపంచాయితీని 5 లేదా అంతకంటే ఎక్కువ విభాగాలుగా చేసి (వార్డు) ఎన్నికలు జరుపుతున్నారు.

ఒక జిల్లాలోని ఒక్కొక్క ప్రాంతంలో కొన్ని గ్రామపంచాయితీలను కలిపి పంచాయితీ సమితులను ఏర్పాటుచేయడం జరుగుతుంది. ప్రతీ గ్రామపంచాయితీ 3 లేదా ఎక్కువ మంది సభ్యులను ఎన్నిక చేసి పంపడం జరుగుతుంది. ఎన్నిక కాబడిన ప్రతినిధులతో పంచాయితీ సమితి ఏర్పడుతుంది. ప్రతీ పంచాయితీ సమితి 3 లేదా ఎక్కువ మంది సభ్యులతో ఎన్నిక చేసి జిల్లా పంచాయితీకి ప్రతినిధులుగా పంపడంతో జిల్లా పంచాయితీ ఏర్పడుతుంది. ఎన్నిక కాబడిన అసెంబ్లీ, పార్లమెంటు సభ్యులు జిల్లా పంచాయితీలో సభ్యులుగా వుంటారు. ప్రస్తుత భారతరాజ్యాంగ నిబంధనల మేరకు మూడంచెల పంచాయితీ వ్యవస్థ వున్న గ్రామసభ సంవత్సరానికి రెండు మూడుసార్లు సమావేశపరచినా వారికి రాష్ట్ర శాసనసభ నిర్ణయం అమలులో సలహా ఇచ్చేందుకే అధికారముంది కానీ మూడంచల విధానంలో తమకు వ్యతిరేకమైన నిర్ణయాలను తిరస్కరించే అధికారం లేదు.

జిల్లా పంచాయితీకి ఆరోగ్యం, పారిశుద్ధం, తాగునీరు, విద్యుత్, రహదారులు, ఉపాధి కల్పన అంశాలపై నిర్ణయించే అధికారాలు కలిగి వుంది. కానీ ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయ పార్టీలు అడుగడుగునా ప్రతీ విభాగంలోనూ, ప్రతీ మెట్టులోనూ ఆటంకాలు కల్గించే అధికారం కలిగి వున్నాయి. రాజకీయ పార్టీలు పంచాయితీరాజ్‌లోని మూడంచెల విధానంలో ఎన్నికలలో జోక్యం చేసుకొంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఒక్కమాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ప్రస్తుత పంచాయితీరాజ్ వ్యవస్థను నామమాత్రం చేసి సర్వాధికారాలు చెలాయిస్తూ పంచాయితీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి.